క్లుప్తంగా

ఇ-పంట నమోదు తప్పనిసరి



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రామాంజులరెడ్డి

కొండాపురం: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఏవీ రామాంజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొండాపురం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరోసా కేంద్రాల్లో మండలంలో రైతులు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు ఇ-పంట నమోదు చేయాలని సూచించారు. ఇ- క్రాప్ నమోదు చేసుకుంటే క్రాప్ ఇన్సూరెన్స్, అన్నదాత సుఖీభవ, పీఎం కిషాన్ వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే పంటరుణాలు, పంటనష్ట పరిహారం పొందాలన్నా, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయించాలన్నా ప్రతిరైతు తప్పనిసరిగా ఇ- క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటకోత ప్రయోగాలకు సంబంధించి ఫారం-1 త్వరగా సెలక్ట్ చేసి సీపీఓ కార్యాలయానికి పంపాలన్నారు. రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పురోభివృద్ధికి కృషి



జిల్లా నేతలను సన్మానిస్తున్న స్థానిక నాయకులు

కమలాపురం: వైఎస్సార్‌సీపీ పురోభివృద్ధికి కృషి చేస్తామని ఆ పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కమిటీలో నూతనంగా నియమితులైన రాజుపాళెం సుబ్బారెడ్డి (వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు), సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి (జిల్లా ప్రధాన కార్యదర్శి)ని మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల నాయకులుగా కొనసాగుతున్న సుబ్బారెడ్డి, రాజశేఖర్ రెడ్డిలను జిల్లా కమిటీలో నియమించడం హర్షణీయం అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి పర్యవేక్షణలో అనేక పోరాటాలు చేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఫాగింగ్ చేపడుతున్న మున్సిపల్ సిబ్బంది

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో దోమల నివారణకు సోమవారం సాయంత్రం ఫాగింగ్ చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో చిన్నరంగాపురంలో పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక వాహనం ద్వారా దోమల నివారణకు పొగ మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ప్లాస్టిక్ డబ్బాలు, పాత టైర్లు, వాడి పారేసిన కొబ్బరి బోండాలు లేకుండా చూసుకోవాలని, ఇంటి పైకప్పుపై అనవసర వస్తువులు ఉంచడం వలన దోమలు వ్యాపిస్తాయని తెలిపారు. నిల్వ నీటిలోనే దోమలు గుడ్లు పెట్టి లార్వా ద్వారా డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతకరమైన వ్యాధులకు కారణమైన దోమలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కొండయ్య

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని శ్రీమిట్టమల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం ఈడిగ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆ సంఘం అధ్యక్షుడు కొండయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలోని ఈడిగ కులస్తుల అభ్యున్నతికి పాటుపడ్డామని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు సూర్యనారాయణ, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, బాలు, రంగా, భూపాల్, భాస్కర్ పాల్గొన్నారు.

11న వాలీబాల్ టోర్నమెంట్

పులివెందుల టౌన్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 11వ తేదీన పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో పులివెందుల నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నెహ్రూ ఉప కేంద్రం, ఎస్‌సీఎస్‌ఆర్ ఎండీ చంద్రశేఖరరెడ్డి సంయుక్త సహకారంతో స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఈ టోర్నీలో విన్నర్, రన్నర్ జట్లకు ప్రశంసా పత్రం, మెమెంటోలతో పాటు నగదు బహుమతులు అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని వాలీబాల్ క్రీడాకారులు తమ జట్ల వారీగా 9966509364 ఫోన్ నంబర్‌ను సంప్రదించిన పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఈట్ స్ట్రీట్‌కు గ్రహణం



ఈట్ స్ట్రీట్‌కు వెళ్లే దారిలో మూసిన గేటు



ఖాళీగా దర్శనమిస్తున్న స్టాల్స్

- వ్యాపారాలు లేక ఖాళీగా దర్శనమిస్తున్న స్టాల్స్
- సందర్శకులకు వసతులు దూరం
- దారిలేక అవస్థలు

పులివెందుల టౌన్ : పులివెందుల ప్రాంత ప్రజల కోసం ఆహ్లాదం, ఆనందం అందించాలన్న ఉద్దేశ్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కోట్లాది రూపాయలతో పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న నగరవనం, గరండాల్ రివర్ పార్కులను ఎంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. ఇక్కడికి వచ్చే సందర్శకులు సేద తీరేందుకు ఈట్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేసి కావాల్సిన వారికి తినుబండారాలు, శీతల పానీయాలు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, టీ, కాఫీ పాయింట్లు ఉండేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అన్ని వసతులను కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పార్కుల గురించి, కానీ ఈట్ స్ట్రీట్ గురించి పట్టించుకోకపోవడంతో ఈట్ స్ట్రీట్‌కు గ్రహణం పట్టిందని సందర్శకులు వాపోతున్నారు.

ఖాళీగా స్టాల్స్

పులివెందుల పట్టణంలో కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈట్ స్ట్రీట్ సందర్శకులు లేక కళావిహీనంగా మారింది. ఈట్ స్ట్రీట్‌లో మొత్తం 15 స్టాల్స్ ఏర్పాటు చేసి.. ప్రారంభ సమయంలో 9 స్టాల్స్‌లో వ్యాపారాలు నిర్వహించేవారు. సందర్శకులు సేద తీరేందుకు ఇక్కడ బల్లలు ఏర్పాటు చేశారు. కాసేపు సేదతీరుతూ నచ్చిన స్నాక్స్ తింటూ ఆనందంగా గడిపేవారు. కాలక్రమేనా అక్కడ వ్యాపారాలు జరగకపోవడంతో ఒక్కొక్కటి మూత పడుతూ వచ్చాయి. ప్రస్తుతం ఈట్ స్ట్రీట్‌లో మిల్లెట్‌తో కూడిన ఆహారం అందించే ఒక్క స్టాల్ మాత్రమే ఉంది. మిగిలిన స్టాల్స్ అన్ని ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

సందర్శకుల్లో నిరాశ

ఫారెస్ట్ అధికారులు దుకాణాలకు దగ్గరగా ఉన్న గేటును మూసివేయడంతో సందర్శకులు వచ్చేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో వ్యాపారాలు లేక దుకాణదారులు ఖాళీచేసి వెళ్లిపోయారు. శని, ఆదివారాలు, సెలవు దినాల్లో ఎంతో మంది సందర్శకులు ఇక్కడకు వస్తుంటారు. అయితే చిన్నపిల్లలు, పెద్దలకు కావాల్సిన తినుబండారాలు ఇక్కడ లేకపోవడంతో నిరాశగా వెనుతిరుగుతున్నారు. ఒకే ఒక షాపు ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఆవులు లోపలికి వస్తున్నాయని, వాటి తాకిడిని తట్టుకోలేక గేట్లు మూసివేశామని ఎఫ్‌బీఓ గోపాల కృష్ణ అంటున్నారు. ఈ విషయమై డీఎఫ్‌ఓను వివరణ కోరగా చిన్నగేటు ఏర్పాటు చేసుకోవాలని తెలిపామని పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది



నగరవనంలో ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్‌లో కాసేపు కూర్చొని సేదతీరుతూ స్నాక్స్, కాఫీ తాగుతుంటే ఎంతో బాగుంటుంది. పక్కన ఉన్న గేటు మూయడంతో చాలా దూరమనిపిస్తుంది. రోజు రావాలన్నా దూరమని రాలేక వారంలో ఒకరోజైనా వచ్చి వెళుతుంటాను. ఈట్ స్ట్రీట్‌కు అనుకూలంగా గేటును ఏర్పాటు చేయాలి.

– మునిబాబు, సందర్శకుడు, పులివెందుల

చాలా బాగుంటుంది



నగరవనానికి రావాలంటే చాలా బాగుంటుంది. చక్కటి వాతావరణంతో పాటు చిన్నపిల్లలకు కావాల్సిన చిరుతిండ్లు ఇక్కడ ఈట్ స్ట్రీట్‌లో ఉంటాయి. వాటితో మా పిల్లలు ఎంజాయ్ చేస్తుంటారు. దగ్గరగా ఉన్న గేటు మూయడంతో ఇక్కడకు రావడం ఇబ్బందిగా ఉంటుంది. గేటు ఓపెన్ చేస్తే బాగుంటుంది.

– శివకుమార్, సందర్శకుడు, పులివెందుల

10న శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఆయన మాట్లాడుతూ 10వ తేదీన స్వామి వారి దర్శనం కొనసాగుతుందని, శాశ్వత రథోత్సవ ఉభయ దారులు, మహా కుంభాభిషేకం జరిపించిన మేడం వంశీయులు, దినేష్ మెడికల్ స్టోర్స్ అధినేత మేడం దినేష్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీరంగనాథ స్వామి శ్రీదేవి భూదేవిల కల్యాణం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారన్నారు. అలాగే భక్తుల సహకారంతో మధ్యాహ్నం 12గంటల నుంచి అన్న తీర్థ ప్రసాదాలను ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారు పులివెందుల పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. ఈనెల 13వ తేదీన శ్రీరంగనాథ స్వామి ఆలయంలో శ్రీగోదామాత శ్రీరంగనాథ స్వాముల కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

పులివెందుల రూరల్ : శ్రీరంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయానికి ఆయన చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ పునః పరిశీలన

కమలాపురం: మండలంలోని పక్షవాతం, మానసిక రోగులు, కిడ్నీ బాధితులు, కండరాల క్షీణతతో బాధ పడుతూ మంచానికే పరిమితమైన వారి పింఛన్లను బుధవారం పునః పరిశీలన చేస్తామని ఎంపీడీఓ జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం మండలంలో 32 మంది ఇలాంటి పింఛన్లు పొందుతున్నారని, వారి ఇంటికే నేరుగా వైద్య బృందం వెళ్లి వారిని మరోసారి పరీక్షిస్తారన్నారు. వైద్య బృందం వెరిఫికేషన్ తర్వాత ఇచ్చే రిపోర్ట్‌ను డీఎం అండ్ హెచ్‌ఓ లాగిన్‌లో సబ్‌మిట్ చేస్తారని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేసి కొత్త వెరిఫికేషన్‌లో వారు నిజంగా అర్హులని తేలితే పింఛన్ మంజూరుకు ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తారని ఆమె తెలిపారు. పింఛనర్లు వైద్య బృందాలకు సహకరించాలని కోరారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



మాట్లాడుతున్న డాక్టర్ స్వరూప్ వేదానంద్

జమ్మలమడుగు రూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవాలని విశ్రాంత ఫోరెన్సిక్ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ స్వరూప్ వేదానంద్ అన్నారు. సోమవారం కోవెలకుంట్ల రహదారిలో ఉన్న గీతాంజలి హైస్కూల్‌లో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు అనేవి విద్యార్థుల మొక్క సామర్థ్యాన్ని వెలికితీసే ప్రక్రియ అని తెలిపారు. 10వ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ ఇష్టంతో చదువుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పెద్దముడియం మండల విద్యాశాఖాధికారి చౌడయ్య మాట్లాడుతూ దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు.. ప్రతీ విద్యార్థి పెద్ద పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునే లా పట్టుదలతో చదవాలని సూచించారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని చేరాలంటే క్రమశిక్షణ, బాధ్యతతో విద్యను అభ్యసించాలన్నారు. అధ్యాపకులు బెన్‌హర్, కరస్పాండెంట్ శేషారెడ్డి పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల : 132/33 కేవీ పులివెందుల సబ్ స్టేషన్ మెయింటెన్స్ కారణంగా 33 కేవీ మురారి చింతల విద్యుత్ ఫీడర్ పరిధిలో, కోమన్నూతల 33 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిల్లోని కోమన్నూతల, తాతిరెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయానికి సంబంధించి మంగళ, బుధవారాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ బాల సంజీవులు తెలిపారు. రైతులందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వేంపల్లెలో..

వేంపల్లె : వేంపల్లె టౌన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దినేష్ కుమార్ తెలిపారు. విద్యుత్తు లైన్ల మరమ్మతులు కారణంగా పట్టణంలోని కడప రోడ్డులోని పోలీస్ స్టేషన్, గవర్నమెంట్ హాస్పిటల్, ఆర్టీసీ బస్టాండ్, తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వేంపల్లె పట్టణ ప్రజలందరూ సహకరించాలన్నారు.

జమాలపల్లెలో రెవెన్యూ సదస్సు

చింతకొమ్మదిన్నె : మండలంలోని జమాల్‌పల్లె భూమి సమస్యలపైన జె.కొత్తపల్లె జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి ఆర్ఓఆర్, ఫ్రీహోల్ సమస్యలపై ఐదు అర్జీలు మాత్రమే వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగేశ్వరరావు, ఆర్ఐ ఆది రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం చెర్లోపల్లి గ్రామ భూ సమస్యలపై పాపాసాహెబ్‌పేట సచివాలయంలో నిర్వహించనున్నారు.

నివాళి



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ఇప్పపెంట మాజీ సర్పంచ్ సాహెబ్ పీర్ (78) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి మృతుడి ఇంటికి వెళ్లి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనివాసులరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కళా యాదవ్, సర్పంచులు రాజశేఖరరెడ్డి, సురేంద్రనాథ్, సుబ్బారాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు మలుపు.. ప్రమాదాలకు పిలుపు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం నుంచి వెలిదండ్ల రోడ్డులో సింహాద్రిపురానికి అతి చేరువలో ఉన్న రోడ్డు మలుపు ప్రమాదాలకు పిలుపుగా మారింది. ఈ రోడ్డు మలుపులతో పాటు కంపచెట్లు ఉండటంతో ప్రమాదాలు జరిగి ఎంతో మందికి కాళ్లు, చేతులు విరిగిన సంఘటనలతో పాటు ప్రాణాలు పోగొట్టుకున్నవారు ఉన్నారు. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా రైతుల భూములు కొనుగోలు చేయడానికి గతంలో జమ్మలమడుగు ఆర్డీఓ రైతులతో చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. దీంతో రోడ్డు మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ రోడ్డులో ఉన్న మలుపులను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు మలుపు

వివాదాలకు తావు లేకుండా భూసర్వే



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

వల్లూరు (చెన్నూరు) : ఎలాంటి వివాదాలకు తావు లేకుండా భూ రీ-సర్వే నిర్వహించాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని శివాలపల్లె గ్రామంలో భూ రీ సర్వేపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ రీ-సర్వేలో పైలెట్ ప్రాజెక్టుగా శివాల్ పల్లె గ్రామం ఎంపిక అయిందని తెలిపారు. వివాదాలకు ఆరోపణలకు ఆస్కారం లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. ప్రతి రైతు సంతృప్తి చెందేలా ఉండాలని ఆయన సూచించారు. తహసీల్దార్ సరస్వతి మాట్లాడుతూ సర్వేపై ఈనెల 9 తేదీన రైతులతో గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ సభలో రైతులకు రీ సర్వే పై అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామ సభకు రైతులు తప్పక హాజరు కావాలని కోరారు. డీటీ వెంకటరమణ, మండల సర్వేయర్ సోమశేఖర్, వీఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, విలేజ్ సర్వేయర్లు ఈశ్వర్, శివారెడ్డి, పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నిరసన



పులివెందుల ఆర్టీసీ డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద సోమవారం తెల్లవారుజామున ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు నిరసనకు దిగారు. ఆర్టీసీ డ్రైవర్లకు ఏ నిబంధనలు ఉన్నాయో, తమకు అదే నిబంధనలు వర్తింపచేయాలని పులివెందుల ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు డిమాండ్ చేశారు. సోమవారం తెల్లవారుజామున నుంచి 30 మంది అద్దె బస్సు డ్రైవర్లు ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ ఆర్టీసీ డీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ పులివెందుల ఆర్టీసీ డిపో పరిధిలో రెండేళ్ల కాలంలో 30 మంది అద్దె డ్రైవర్లను సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. తమను సస్పెండ్ చేస్తూ పోతే డ్రైవర్ల కుటుంబాలు జీవనాధానం పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 డిసెంబర్ 31న రామాంజనేయుల అనే అద్దె బస్సు డ్రైవర్‌కు మద్యం పరీక్షలు 18 శాతం రావడంతో అతనిని సస్పెండ్ చేయడంతో అద్దె బస్సు డ్రైవర్లు సోమవారం ఉదయం నిరసనకు దిగారు. ఆర్టీసీలో ఉన్న పర్మినెంట్ డ్రైవర్లకు మాత్రం ఈ విధంగా మద్యం శాతం వస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుని సంవత్సరంలో మూడు సార్లు అనుమతిస్తారని, కాంటాక్ట్ ఉద్యోగులను కూడా అదే విధంగా చూడాలన్నారు. అనుభవం లేని డ్రైవర్ల ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని, అనుభవం ఉన్న డ్రైవర్లు చిన్న తప్పులను క్షమించి వారిని మళ్లీ విధుల్లోకి ఆర్టీసీ యాజమాన్యం తీసుకోవాలని వారు కోరారు. ఈ సంఘటనపై ఆర్టీసీ డీఎం రామకృష్ణను వివరణ అడుగగా.. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సోమవారం ఉదయం 5గంటల నుంచి నిరసనకు దిగారని చెప్పారు. డిసెంబర్ 31న ఒక డ్రైవర్ మద్యం సేవించి రావడంతో ఆల్కహాల్ పరీక్ష నిర్వహించగా అందులో 18 శాతం ఆల్కహాల్ శాతం రావడంతో సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

ఆలయ భూములను రీసర్వే చేయాలి



మాట్లాడుతున్న శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పాత కలమల్ల గ్రామంలోని శ్రీ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములపై రీసర్వే చేసి, ఆ భూములను ఆలయానికి అప్పగించాలని ఆలయ కమిటీ నిర్వహకులు కోరారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో వారు మాట్లాడుతూ రేనాటి చోళుల వంశానికి చెందిన ధనుంజయుడు ఇక్కడ శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయం, శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలను నిర్మించారని తెలిపారు. సిద్ధేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి సుమారు 63 ఎకరాలు భూమి ఉందన్నారు. అయితే కొందరు ఆ భూమి నుంచి వచ్చే ఆదాయంను వాడుకుంటున్నారని విమర్శించారు. దేవదాయ శాఖ అధికారులు స్పందించి సిద్ధేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి భూములను రీసర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ త్వరగా పూర్తి చేయాలి

సింహాద్రిపురం : ఇళ్ల జియో ట్యాగింగ్‌ను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సచివాలయ సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని గురిజాల, హిమకుంట్ల తదితర గ్రామ సచివాలయాల్లో జియో ట్యాగింగ్‌ను ఆయన పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల జియో ట్యాగ్ సర్వే, పీపీసీఎస్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వేలు తప్పకుండా పూర్తి చేయాలని, లేకపోతే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో గురిజాల, హిమకుంట సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

తేనెటీగల పరిశ్రమపై అవగాహన



తేనెటీగల పరిశ్రమపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు తేనెటీగల పరిశ్రమపై సర్టిఫికెట్ కోర్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు విద్యార్థులకు తేనెటీగలు ఎన్ని రకాలు, వాటిని ఉపయోగించి తేనెను ఎలా ఉత్పత్తి చేయవచ్చు, ఉపయోగాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.సుధీర, డాక్టర్ బాలనారాయణ, కోర్సు కో ఆర్డినేటర్ శ్రీనిత, జనార్దన్ పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

– సమీక్షా సమావేశంలో ఆర్‌డీఓ జాన్ ఎర్విన్



మాట్లాడుతున్న కడప ఆర్‌డీఓ జాన్ ఎర్విన్

కమలాపురం: ప్రతి అర్జీదారుడు సంతృప్తి పడే విధంగా వారి సమస్యలను పరిష్కరించాలని కడప ఆర్‌డీఓ జాన్ ఎర్విన్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలపై రివ్యూ సమావేశం నిర్వహించారు. ఏయే పంచాయతీల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి? అందులో ఉన్న ప్రధాన సమస్యలు ఏంటి? అనే వివరాలు వీఆర్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. అందులో కమలాపురం మండలం నుంచే అత్యధిక అర్జీలు వచ్చాయన్నారు. 1188 అర్జీలు వస్తే వాటిలో 800కు పైగా అర్జీలు భూ రీసర్వేకు సంబంధించినవే అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసమే అర్జీలు తీసుకున్నామని, ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని సమస్యలపై రెస్పాన్స్‌తో, శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, డీటీలు రోష్ని, శ్రీకాంత్, ఆర్ఐ జహురుద్దీన్, ఏఎస్‌ఓ ఇర్షాద్ బేగం, వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరతో చీడలకు తెర!

సాధారణంగా మిరప పంటలో బంతిపూలను చూస్తుంటాం. చాలా మందిలో పూలకోసమో లేదా పంటకు దిష్టి తగలకుండానో, అందంగా ఉండాలని వేస్తారని అనుకుంటారు. కానీ బంతి పూలు సాగు చేయడం వలన పొగాకు లద్దెపురుగు, రసం పీల్చేపురుగు, శనగ పచ్చపురుగులు ఆశించవు. బంతిపూలు లేకపోతే ఈ పురుగులు మిరప ఆకులను ఆశిస్తాయి. ఆకులను తినేస్తే కిరణజన్య సంయోగక్రియ జరగక పంట దెబ్బతింటుంది. దీంతో మిరప పంటకు రక్షణగా.. అందంగా పురుగులను ఆకర్షించేలా ఉండటంతో బంతిపూలను ఎరపంటగా వేస్తారు. అయితే పచ్చని ఆకులతో నిండుగా ఉండే మిరప తోటలో పచ్చని, నారింజ రంగు పూలతో తోటకు అందం తెస్తాయి. రక్షణగా, అందంగా ఉంటూ రైతన్నకు మేలు చేకూరుస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

–పెద్దముడియం



నెమళ్లదిన్నె గ్రామంలో మిరప పంటతో వేసిన బంతిపూలు



పెద్దపసుపులలో..